క్లుప్తంగా

ఆర్బీకేల్లో ఎరువులు



యూరియా పంపిణీ చేస్తున్న ఏఓ సుహర్‌లత

వరదయ్యపాళెం: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో రానున్న సీజన్‌కు యూరియా, డీఏపీలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారిణి సుహర్‌లత తెలిపారు.సోమవారం నెల్లటూరు రైతు భరోసా కేంద్రంలో స్థానిక రైతులకు యూరియా బస్తాలను ఆమె పంపిణీ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకు రూ. 266.50, డీఏపీ రూ. 1250 చొప్పున రైతులు చెల్లించి స్థానికంగా ఉన్న రైతు భరోసా కేంద్రాల వద్ద పొందవచ్చని ఆమె చెప్పారు. ఎంతమేరకు అవసరమో తక్షణమే రైతులకు అందుబాటులోకి తెస్తామని ఆమె చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రవీణ్, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే పేదరిక నిర్మూలన



బండారుపల్లె ఎస్టీ కాలనీలో బడిఈడు పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అరుణ

ఏర్పేడు: విద్యతో విజ్ఞానం పొందడమే కాకుండా పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని యువ నేస్తం అసోసియేషన్ మండల కో–ఆర్డినేటర్ అరుణ అన్నారు. సోమవారం మండలంలోని బండారుపల్లె, కుప్పయ్యకండ్రిగ ఎస్టీ కాలనీల్లో బడిఈడు పిల్లల గుర్తింపు కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎక్కువగా ఎస్టీ కాలనీల్లో పిల్లలు విద్యకు దూరంగా ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే విద్యా సంవత్సరంలో బడిఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని వసతులు ఉన్నాయని వివరించారు. యువనేస్తం అసోసియేషన్ వలంటీర్లు లక్ష్మి, స్రవంతి, స్వాతి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరంతో విద్యార్థులకు పోటీలు



విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేస్తున్న ప్రజా ప్రగతి ప్రతినిధులు

వరదయ్యపాళెం: విద్యార్థులు విద్యతో పాటు మానసిక, శారీరక వికాసం పెంపొందించుకోవడానికి వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని ప్రజా ప్రగతి ట్రస్టు కో–ఆర్డినేటర్ సుబ్రమణ్యం కోరారు. మండలంలోని కాంబాకం గిరిజనకాలనీలో ప్రజా ప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో వేసవి శిక్షణా శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. విద్యార్థులకు కబడ్డీ, ఖో–ఖో, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ అనూష, సభ్యులు పోలమ్మ, రేవతి, సుబ్రమణ్యం, ట్రస్టు సిబ్బంది ఓంకార్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్, దంత పరీక్షలకు స్పందన



దంత పరీక్షలు చేస్తున్న డాక్టర్ భార్గవ్

ఏర్పేడు: మండంలలోని వికృతమాలలో రాస్ మహిళా భారతి ప్రాజెక్ట్, తిరుపతి టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన క్యాన్సర్, దంత పరీక్షల ఉచిత శిబిరానికి మంచి స్పందన లభించింది. రాస్ మహిళా భారతి ప్రాజెక్ట్ అధికారి బాలాజీరెడ్డి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ప్రారంభించారు. వికృతమాల, ఎస్సీ, ఎస్టీ కాలనీలు, గోవిందవరం, మర్రిమంద తదితర గ్రామాల నుంచి వచ్చిన 154 మందికి నోటి, రొమ్ము, గర్భముఖ కేన్సర్, హైపటైటిస్, బీపీ, మమ్మోగ్రామ్ పరీక్షలు ఉచితంగా చేశారు. 30 నుంచి 65 ఏళ్ల లోపు మహిళలు ప్రతి ఆరునెలలకోసారి వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ భార్గవ్, టాటా ట్రస్ట్ కో–ఆర్డినేటర్ రెడ్డికుమారి, ప్రోగ్రాం మేనేజర్ పీవీ హేమంత్‌కుమార్, రాస్ మహిళా భారతి ప్రాజెక్ట్ ఎలగిరి ప్రసాద్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి

నారాయణవనం: మండలంలోని వెత్తలతడుకు పంచాయతీకి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు కృష్ణయ్య ఆదివారం సాయంత్రం ఆయన మృతి చెందారు. సోమవారం ఎమ్మెల్యే ఎంపీపీ దివాకర్‌రెడ్డి, సర్పంచ్ రామ్మూర్తితో కలిసి కృష్ణయ్య నివాసానికి వెళ్లి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

పక్కా ప్రణాళికతో 10లో ఫలితాలు భేష్

మండలం పేరు	పరీక్ష రాసిన విద్యార్థుల సంఖ్య	ఉత్తీర్ణులైన వారి సంఖ్య
శ్రీకాళహస్తి పట్టణం	915	654
శ్రీకాళహస్తి (మం.)	357	250
రేణిగుంట (మం.)	536	296
ఏర్పేడు (మం.)	659	498
తొట్టంబేడు (మం.)	303	197
	2,770	1,893

- టెన్త్ ఫలితాల్లో సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 2770కిగాను 1,893 మంది ఉత్తీర్ణత
- ఏర్పేడు మండలం బండారుపల్లె హైస్కూల్‌లో అందరూ పాస్
- తొండమనాడు విద్యార్థిని ధృవితారెడ్డి ఉత్తమ మార్కులతో జిల్లా టాపర్



బాలుర ఉన్నత పాఠశాల ముఖచిత్రం

రేణిగుంట: 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరచారు. మొత్తం 2,770మంది విద్యార్థులు పరీక్ష రాయగా, వారిలో 1,893 మంది ఉత్తీర్ణులయ్యారు. 68.3 శాతం ఉత్తీర్ణత సాధించారు.

కార్పొరేట్‌కు దీటైన వసతులు

ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు పథకం ద్వారా అధునాతన మౌలిక వసతులు సమకూరాయి. తరగతి గదిలో బోధనాభ్యసన ప్రక్రియ సజావుగా సాగేందుకు అనుకూలమైన వాతావరణాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. దీంతో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. నియోజకవర్గంలోని ఏర్పేడు మండలం బండారుపల్లె హైస్కూల్ విద్యార్థులు 30 మంది పరీక్ష రాయగా, అందరూ ఉత్తీర్ణులై 100శాతం ఫలితాలు సాధించారు. అలాగే ఏర్పేడు వ్యాసాశ్రమం ప్రభుత్వ ఎయిడెడ్ స్కూల్‌లో 36 మంది విద్యార్థినులు పరీక్ష రాయగా, అందులో 35 మంది ఉత్తీర్ణులై 97శాతం ఉత్తీర్ణతను సాధించారు. శ్రీకాళహస్తి మండలం తొండమనాడు హైస్కూల్ విద్యార్థిని చెవిరెడ్డి ధృవితారెడ్డి ఉత్తమ మార్కులతో జిల్లా టాపర్‌గా నిలవడం విశేషం!



నాడు–నేడు పథకంతో రూపురేఖలు మారిన రేణిగుంట బాలుర ఉన్నత పాఠశాల లోపలి ప్రదేశం

ప్రణాళికాబద్ధంగా ఉపాధ్యాయుల బోధన



టెన్త్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడం చాలా సంతోషంగా ఉంది. ఈ ఏడాది ప్రారంభం నుంచే టెన్త్ విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహించాం. సాయంత్రం విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడాం. ఇళ్ల వద్ద కూడా విద్యార్థులు చదివేలా చర్యలు తీసుకున్నాం. ఇక, ప్రభుత్వం కల్పించిన మౌలిక వసతులు, జగనన్న విద్యాకానుక, అమ్మ ఒడి వంటి ప్రోత్సాహకాలు విద్యార్థుల పురోభివృద్ధికి బాటలు వేశాయి. ఇలాంటి ఫలితాలు రావడం వల్ల ప్రభుత్వ పాఠశాలలపై మరింత విశ్వాసం పెరిగే అవకాశం ఉంది.

–వెంకటరమణ, ప్రధానోపాధ్యాయుడు, బండారుపల్లె జెడ్పీ హైస్కూలు, ఏర్పేడు

ప్రజా సంక్షేమమే ధ్యేయం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, నాయకులు

సత్యవేడు: ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పునరుద్ఘాటించారు. సోమవారం సాయంత్రం సత్యవేడు సచివాలయం 2 పరిధిలోని గంగమిట్ట వీధి, నేతాజీ రోడ్డులో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. 204 కుటుంబాలను ఎమ్మెల్యే పలకరించారు. ప్రతి ఇంటికీ రూ. లక్ష నుంచి 3లక్షల వరకూ సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అని ఆయన సంక్షేమ బుక్‌లెట్లతో లబ్ధిదారులకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీకి పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. రెండవ సచివాలయ పరిధిలో వివిధ పథకాల ద్వారా221 మందికి 2.9కోట్లు మంజూరయ్యాయని, 22 ఇళ్లస్థలాలు మంజూరు చేశామన్నారు. రైలు ప్రమాదంలో గాయపడి అనారోగ్యం బారిన పడిన వసంత్‌కు పింఛన్ మంజూరు చేయాలని అతడి తల్లి కోరింది. అలాగే వార్డు పరిధిలో మరో ముగ్గురు అర్హులు పింఛను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అర్హులకు పింఛను మంజూరు చేయాలని ఎంపీడీఓ రమణకుమార్‌ను ఆయన ఆదేశించారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

తానప్పమొదలి వీధిలో రోడ్డు, మురుగు కాలువలు పూర్తిగా పాడైపోయి రోడ్డుపై మురుగు ప్రవహిస్తోందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కళ్యాణ మండపం వీధిలో బ్రిడ్జి కూలిపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, గాంధీరోడ్డు మలుపు వద్ద ప్రమాదకరంగా మురుగు కాలువ గుంత ఉందని నివేదించారు. సచివాలయానికి మంజూరయ్యే రూ. 20లక్షలతో ఈ సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. పార్టీ మండల కన్వీనర్ కే.సుశీల్ కుమార్ రెడ్డి, ఎంపీపీ వి.ప్రతిమ, జెడ్పీటీసీ సభ్యురాలు పి.విజయలక్ష్మి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే.చంద్రశేఖర్‌రెడ్డి, సురుటుపల్లి ఆలయ చైర్మన్ ఏపీఎం బాలాజీ రెడ్డి, సచివాలయ కన్వీనర్ల మండల అధ్యక్షుడు బొప్పన సోమశేఖర్, వ్యవసాయల సలహా మండల కమిటీ అధ్యక్షుడు శ్యాంప్రసాద్ రెడ్డి, వైద్యశాల కమిటీ సభ్యుడు గోవిందస్వామి, మహిళా అధ్యక్షురాలు మస్తానమ్మ, పార్టీ ముఖ్య నాయకులు రమేష్, పునిద కుమార్, దయాళన్, దీనదయాల్, తహసీల్దారు శ్రీదేవి, ఈఓపీఆర్డీ మునిరవికుమార్ పాల్గొన్నారు.

పరస్పర సహకారంతో ప్రగతి

- మండల సమావేశంలో ఎమ్మెల్యే ఆదిమూలం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: ప్రజా సమస్యలపై మండల స్థాయి అధికారుల్లో జవాబుదారీతనం ఉండాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వి.ప్రతిమ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజవర్గంలో ఏడు మండలాలను ప్రజాప్రతినిధులతో పాటు మండల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పరస్పర సహకారంతో ప్రగతి పథంలో నడిపించి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని కోరారు. దాసుకుప్పం బైపాస్ రోడ్డు ఏర్పాటుకు రూ.26 కోట్లు మంజూరు చేశామన్నారు. రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు సమన్వయంతో త్వరితగతిన రోడ్డు సర్వే చేయించాలని, రైతులకు పరిహారం ఇచ్చేందుకు చొరవ చూపాలని ఆదేశించారు. గ్రామ సచివాలయాలు16, రైతుభరోసా కేంద్రాలు13, వైఎస్సార్ హెల్త్ కినిక్స్13 మంజూరయ్యాయని, ఇప్పటివరకు 5భవనాల నిర్మాణాలే పూర్తి చేశారని, మిగిలిన వాటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలు జరిగిన పంచాయతీల అభివృద్ధికి 84 పనులు, గ్రామాల్లో వసతుల కల్పనకు రూ.1.49 కోట్లు మంజూరయ్యాయన్నారు.

భూ ఆక్రమణల నిగ్గు తేల్చండి

మండలంలో ప్రభుత్వ భూములను కొందరు ధనికులు, మాజీ ఎమ్మెల్యే హేమలత కొత్తమారికుప్పం పరిధిలో సుమారు 14 ఎకరాలు ప్రభుత్వ భూమి ఆక్రమించినట్లు ఆరోపణలు ఉన్నాయని, ఆక్రమణలు నిగ్గు తేల్చి, పేదలకు భూములు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని, అలాగే సత్యవేడులో సంతకు స్థలం కేటాయించాలని తహసీల్దార్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. వ్యవసాయాధికారి మురళి, ఎంపీడీఓ రమణకుమార్, ఎంఈఓ రవి వివిధ అంశాలపై మాట్లాడారు.

మరికొందరు ఏం మాట్లాడారంటే..

దాసుకుప్పం స్కూలుకు నైట్ వాచ్‌మెన్‌ను హెచ్‌ఎం స్థానిక ప్రజాప్రతినిధులకు చెప్పకుండా నియమించారని సర్పంచ్ రవి ఆరోపించారు. దీనిపై ఎంపీపీ స్పందించారు. ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంతో కొత్త వారిని నియమించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓను ఆదేశించారు. వైద్యశాలలో ఎక్స్‌రే మెషిన్ నిర్వహణకు టెక్నీషియన్‌ను నియమించేందుకు ఎమ్మెల్యే చొరవ చూపాలని డాక్టర్ రమేష్ కోరారు. చిన్న ఈటిపాకం ఎస్టీ కాలనీలో విద్యుత్ లైన్లు పొడిగించాలని ట్రాన్స్‌కో ఏఈని సర్పంచ్ గోవిందస్వామి కోరారు. సత్యవేడు పంచాయతీ ఉలవచేనులో అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం నిర్మించాలని కో–ఆప్షన్ సభ్యులు మస్తానీ కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు, ఎంపీడీఓ, పంచాయతీరాజ్ డీఈ మధుసూదన్‌రావు, హౌసింగ్ ఏఈ వెంకటసుబ్బయ్య, ఏఈఎం స్వర్ణలత, సీడీపీఓ దేవకుమారి, ఏపీఓ లోకమ్మ, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారుగా హనుమాన్ నాయక్



బుచ్చినాయుడుకండ్రిగ: తహసీల్దారుగా హనుమాన్‌నాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న టీవీసుబ్రమణ్యం తిరుపతి రూరల్ తహసీల్దారుగా బదిలీపై వెళ్లారు. దీంతో చిన్నగొట్టిగల్లు నుంచి ఇక్కడికి హనుమాన్ నాయక్ బదిలీపై వచ్చారు. మండలంలోని భూసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

టెన్త్ ఫెయిల్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



ప్రత్యేక తరగతిలోని విద్యార్థులను ప్రశ్నిస్తున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు ఎంఈఓ రవీంద్రనాథ్ తెలిపారు. ఆయన సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పది ఫెయిల్ విద్యార్థుల ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 5 జెడ్పీ హైస్కూళ్లకు సంబంధించి ఫెయిల్ అయిన టెన్త్ విద్యార్థులకు సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులను నిర్వహించి, జూన్ 2వ తేదీ నుంచి జరగనున్న సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం చేయాలని కోరారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 86 మంది విద్యార్థులు ఫెయిల్ అవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

పంట నష్టం పరిశీలన

- ఉన్నతాధికారుల నివేదిస్తామన్న ఉద్యానశాఖాధికారిణి

సాక్షి ఎఫెక్ట్..



మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారిణి శారద

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో అకాల వర్షంతో రైతులకు జరిగిన పంట నష్టాన్ని జిల్లా ఉన్నతాధికారుల నివేదించి పరిహారం అందేలా చూస్తానని సూళ్లూరుపేట డివిజన్ ఉద్యానశాఖాధికారిణి శారద తెలిపారు. సోమవారం సాక్షి దినపత్రికలో 'అకాల వర్షం..రైతన్నకు నష్టం' అనే శీర్షిక ప్రచురించిన కథనంపై ఆమె స్పందించారు. స్థానిక కళ్లాలలో ఆరబోసిన మిరప కాయలను, కనమనంబేడులోని మామిడి తోటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం గురించి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ, మళ్లీ అకాల వర్షం పడే అవకాశం ఉందని, కాయలను టార్పాలిన్ పట్టలతో కప్పి ఉంచాలని, ఆరిపోయిన కాయలను ఇంటి దగ్గరే జాగ్రత్త చేసుకోవాలని రైతులకు సూచించారు. తోటలలో ఉన్న మిరప పంటలోని నీటిని బయటకు పంపి, 19:19:19 లేదా 13:0:45 లేదా యూరియాను 10 గ్రాములు లీటరు నీటికి కలిపి పంటపై పిచికారీ చేస్తే యథాస్థితికి వస్తుందన్నారు. కార్యక్రమంలో వీహెచ్ఏ భారత్, వీఏఏ లావణ్య, రేవతి తదితరులు పాల్గొన్నారు.

గరుడ సేవకు గొడుగుల సమర్పణ



గరుడ సేవకు గొడుగులను స్వీకరిస్తున్న డిప్యూటీ ఈఓ నాగరత్నం

పిచ్చాటూరు: నాగలాపురం శ్రీ వేదనారాయణ స్వామి గరుడ సేవకు చెన్నైలోని తిరునింద్రయూర్‌కు చెందిన శ్రీమద్ రామానుజం కైంకర్య ట్రస్ట్ నిర్వాహకులు సోమవారం 2 గొడుగులు సమర్పించారు. ఈ గొడుగులను టీటీడీ డిప్యూటీ ఈఓ నాగరత్నం స్వీకరించి గరుడ సేవకు వినియోగించారు. తిరుమల బ్రహ్మోత్సవాల్లోనూ గరుడ సేవకు ఈ ట్రస్ట్ ఏటా గొడుగులు సమర్పించడం ఆనవాయితీ. కార్యక్రమంలో టీటీడీ ఏఈఓ మోహన్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ట్రస్టు నిర్వాహకులు పాల్గొన్నారు.

సరిహద్దు ప్రాంతంలో గట్టి భద్రతా చర్యలు

- పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు




పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు

వరదయ్యపాళెం: రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన సత్యవేడు పోలీస్ సర్కిల్ పరిధిలో భద్రతా చర్యలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం రాత్రి వరదయ్యపాళెం పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ సాధారణ తనిఖీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడారు. సరిహద్దు ప్రాంతంలో ప్రత్యేక నిఘాతో ఉండడంతోపాటు చోరీల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. సర్కిల్ పరిధిలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా రోజువారీ భద్రతా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పెండింగ్ కేసులపై ఎస్ఐ నాగార్జునరెడ్డితో చర్చించారు. సత్యవేడు సీఐ శివకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ప్లీజ్!


- జెడ్పీ చైర్మన్, సీఈఓలను కోరిన ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్



జెడ్పీ సీఈఓకు వినతి పత్రం ఇస్తున్న సుమన్ కుమార్

పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధికి జెడ్పీ నిధులు కేటాయించి సహకరించాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈఓ ప్రభాకర్ రెడ్డిని జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్ కోరారు. సోమవారం చిత్తూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆయన వారిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. వీటితో పాటు నాగలాపురం మండల సమావేశంలో తీర్మానం చేసిన పనులకు కూడా నిధులు కేటాయించాలని కోరానని, తన విజ్ఞప్తులపై వారు సానుకూలంగా స్పందించినట్లు సుమన్ తెలిపారు. కార్యక్రమంలో సత్యవేడు నియోజకవర్గ వైఎస్ఆర్ టీయూసీ చైర్మన్ ఎస్ఎం సురేష్, నాగలాపురం మండల వైఎస్ఆర్‌సీపీ యూత్ కన్వీనర్ మహేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఆర్ముగం పాల్గొన్నారు.

కరెంటు షాక్‌తో ఎద్దు మృతి



ఏర్పేడు: మండలంలోని ఎండీపుత్తూరు పొలాల్లో సోమవారం విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి చెందింది. గ్రామస్తుల కథనం.. వికృతమాలకు చెందిన నాదముని తన రెండు ఎద్దులతో ఎండీపుత్తూరుకు చెందిన మహేంద్ర ఆచారి పొలాలను వరి నాట్లు నిమిత్తం నల్లమానుతో చదును చేసేందుకు వెళ్లాడు. చదును చేస్తుండగా పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్ తగలడంతో ఓ ఎద్దు అక్కడిక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.లక్ష ఉంటుంది. ఎద్దులపై ఆధారపడి కుటుంబాన్ని పోషిస్తున్న అతడు కన్నీరుమున్నీరయ్యాడు. ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశాడు.

గంగజాతరకు తొలివేషం 'పేరంటాళ్లు'

సత్యవేడు: సత్యవేడు గంగ జాతరలో యువకులు ఆరోగ్య ప్రదాయిని అయిన గంగమ్మకు ఆనవాయితీగా పేరంటాళ్లు వేషం వేశారు. సత్యవేడులో 10, 11వ తేదీలలో గంగ జాతర నిర్వహిస్తున్న నేపథ్యంలో యువకులు మహిళల వేషధారణలో మొక్కులు చెల్లించారు. నూతన ఉద్యోగాలు, అనారోగ్యంతో బాధపడుతున్న పిల్లలు, కుటుంబాల్లో ఇబ్బందులు తొలగిన యువకులు గంగజాతరలో పేరంటాళ్లు వేషం పరిపాటి. స్త్రీల వేషధారణలో ఉన్న పురుషులు తలపై కలశం ఉంచుకుని గాంధీరోడ్డు, నేతాజీ రోడ్డు, పల్లాపు వీధులలో ప్రదర్శనగా వెళ్లి నడివీధి గంగమ్మకు తొలిమొక్కు చెల్లిస్తారు. శక్తికి ప్రతి రూపంగా భావించే గంగమ్మకు గ్రామ దేవతగా స్థానికులు కొలుస్తున్నారు. కరువు, కాటకాలు, రోగాల నుంచి దూరం చేయాలని సత్యవేడు ప్రజలు సుభిక్షంగా , సుఖసంతోషాలతో ఉండాలని మతాలకు అతీతంగా అందరూ ఏకమై సత్యవేడు జాతర నిర్వహిస్తున్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



జీఎన్‌కండ్రిగలో జగనన్న లే అవుట్‌లోని ఇళ్ల నిర్మాణాల వద్ద అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ శ్రీనివాసులు లబ్ధిదారులను కోరారు. సోమవారం ఆయన ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావుతో కలసి స్థానిక జగనన్న లే అవుట్లలో నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలించి మాట్లాడారు. మండలానికి మంజూరైన 1828 ఇళ్లలో 361 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యిందని చెప్పారు. వివిధ దశలలో ఉన్న వాటి గురించి చెప్పారు. గ్రామాల్లోని ఇళ్ల వద్ద వ్యక్తిగతంగా నిర్మించుకుంటున్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే 341 ఇళ్లు బేస్‌మట్టం స్థాయికి చేరుకున్నాయని, వీరందరికి సిమెంట్‌తోపాటు బిల్లులను మంజూరు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈ సుబ్రమణ్యం, సిబ్బంది యుగంధర్, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. స్థానిక హిందూ శ్మశాన వాటికలో రూ 28లక్షలతో పూర్తి చేసిన అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. నూతనంగా నిర్మించిన ప్రహరీ గోడను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మొక్కలను నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ సచివాలయాల్లో చేపట్టాల్సిన పనులను కూడా ప్రజలను తనను కలిసి విన్నవించుకోవడం సరి కాదని అసహనం వ్యక్తం చేశారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రజా సేవకు ప్రాధానత్య ఇవ్వాలని అన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ సుదర్శనరెడ్డి, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, పీఆర్ డీఈ మధుసూదన్, ఎంపీడీఓ గుణశేఖర్, ఈఓ ప్రభురావు, పార్టీ నాయకులు ఏకాంబరం, అన్నాదొరై, కోనేటి బాబు, రామన్, లక్ష్మణన్, సారకాయలు, మోహన్, శంకరయ్య, మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయాల ఉద్యోతులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు



విద్యార్థులతో మాట్లాడుతున్న గ్రంథాలయాధికారిణి శ్రీముఖి



ఏర్పేడు: వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న శివయ్య



తొట్టంబేడులో వేసవి శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

రేణిగుంట: స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం పాఠశాల విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాన్ని గ్రంథాలయాధికారిణి ఏ.శ్రీముఖి ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ నైనారు మధుబాల ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో వివిధ స్కూళ్లకు చెందిన 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు యోగా, ధ్యానం, డ్రాయింగ్, డ్యాన్స్, కథలు, ఇంగ్లిష్ గ్రామర్, ఆటపాటల్లో శిక్షణనిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించే ఈ శిబిరం జూన్ 11వ తేదీన ముగుస్తుందన్నారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. తొలుత సరస్వతీదేవి పూజ నిర్వహించారు. పిల్లల తో యోగ, ధ్యానం చేయించడంతోపాటు దిన పత్రి కలు, కథల పుస్తకాలు చదివించారు. గ్రంథాలయ అధికారిణి మునిరాజమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

తొట్టంబేడులో..

తొట్టంబేడు(రేణిగుంట): విద్యార్థులు వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తొట్టంబేడు ఎంపీడీఓ తరుణాక్షిరెడ్డి కోరారు. సోమవారం తొట్టంబేడు మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో జెడ్పీ హైస్కూలులో స్పోకెన్ ఇంగ్లిష్, పాటలు పాడటం, నృత్యం, డ్రాయింగ్, చెస్, క్యారమ్స్, ధ్యానం..ఇత్యాది వాటిపై వేసవి ఉచిత శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఎంపీడీఓతోపాటు ఎంఈఓ భారతి మాట్లాడారు. వేసవి సెలవులను వృథా చేసుకోకుండా పిల్లలను శిబిరానికి పంపాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. తొట్టంబేడు గ్రంథాలయ అధికారి ఎ.హరిక్రిష్ణ, ఉపాధ్యాయులు జి.రమణయ్య, యస్.పద్మనాభం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.